ఓయూ క్యాంపస్‌లో కొత్త విద్యార్థుల కోలాహలం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో కొత్త విద్యార్థుల రాకతో యూనివర్సిటీ అంతటా కోలాహలంగా మారింది. యూనివర్సిటీ క్యాంపస్‌లోని 9 కాలేజీలో నూతన విద్యార్థులతో సందడి వాతావరణం నెలకొంది. ఇంజినీరింగ్, టెక్నాలజీ కాలేజీల విద్యార్థులు మొదలు ఎంబీఏ, ఎంఈఏ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, బీఈడీ, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులలో ప్రవేశాలు, చివరకు లా కాలేజీ విద్యార్థుల చేరికతో క్యాంపస్ అంతా విద్యార్థులతో కళకళలాడుతోంది. ఓయూలో అన్ని రకాల మౌలిక వసతులున్నా అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

టీబీపై అవగాహన ర్యాలీ



రసూల్‌పురాలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: హ్యూమన్ పీపుల్ టు పీపుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీబీ కోహతావో కార్యక్రమంలో భాగంగా రసూల్‌పురాలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రసూల్‌పురా, జగదీష్‌నగర్, ఇందిరమ్మనగర్ బస్తీల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ క్షయవ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వార్డు ఇన్‌చార్జి టీఎన్. శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు పేదల ఆరోగ్య సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మహిందర్ సింగ్, మనీష్, భూదేవి, అషాయ్‌బబ్బీ, ఆఫ్రీన్, దివ్య, స్థానిక నేతలు దేవులపల్లి శ్రీనివాస్, శాంరెడ్డి, గఫర్,నాసర్ పాల్గొన్నారు.

ఓయూ సాహిత్య వేదిక వార్షికోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సాహిత్య వేదిక 6వ వార్షికోత్సవం కవులు, కళాకారులు, రచయితలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో పాటలు, పద్యాలు, వచన కవితలతో సాహిత్యాభిలాషులను అలరించారు. తెలుగుశాఖ అధ్యాపకులు ప్రొ.కాశీం, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, అక్కిరాజు రామకృష్ణారావు, యామిని, రమేష్, రేలారే గంటా తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఎంఎస్పీ ఇన్‌చార్జిగా మల్లికార్జున్


నియామకపత్రాన్ని అందజేస్తున్న రాగల్ల ఉపేందర్

బౌద్ధనగర్: ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా డప్పు మల్లికార్జున్ నియమితులయ్యారు. గురువారం ఎమ్మార్పీఎస్ పార్టీ కార్యాలయంలో నియామకపత్రాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్, డప్పు మల్లికార్జున్‌కు అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మందకృష్ణ మాదిగ, డప్పు మల్లికార్జున్‌కు ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, రాజు, నరసింహ ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజారావు

గాంధీఆస్పత్రి: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సికింద్రాబాద్ గాంధీ సూపరింటెండెంట్ రాజారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. గాంధీ ఆస్పత్రిని సందర్శించాలని రాజారావు కోరగా, త్వరలోనే వచ్చి సమీక్ష సమావేశం నిర్వహించి నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందేలా కార్యాచరణ రూపొందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు రాజారావు పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని మృతదేహాన్ని మహంకాళి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంజు థియేటర్ ప్రాంతంలోని సోమసుందరం వీధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడిఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 60 ఏళ్ల ఉంటాయని బ్రౌన్ కలర్‌పై ఎరుపు రంగు చెక్స్ షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని సంబంధీకులు ఎవరైనా ఉంటే మహంకాళి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

చిక్కడపల్లిలో..

చిక్కడపల్లి: గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 100 కాల్ ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మెట్రో పిల్లర్ వద్ద చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.

నాలాలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



సనత్‌నగర్: నాలాలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12న బేగంపేట మాతాజీనగర్ సమీపంలో నాలా వెంబడి నడుచుకుంటూ వెళ్తూ జారిపడి నీటిలో కొట్టుకుపోతున్నట్లు డయల్ 100కు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న డీఆర్ఎఫ్ బృందం సహకారంతో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. రాత్రయినా ఆచూకీ లభించకపోవడంతో మరుసటి రోజు గాలించారు. మాతాజీనగర్‌కు కొద్ది దూరంలో నీటిలో తేలియాడుతున్న వ్యక్తిని గుర్తించి ఒడ్డుకు చేర్చి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వివరాలు తెలియరాలేని వయస్సు 35–40 సంవత్సరాల లోపు ఉంటుందని, మృతుడి సంబంధీకులు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగం పేరుతో రూ. 56 వేలు టోకరా

అడ్డగుట్ట: ఉద్యోగం పేరుతో ఓ యువతిని మోసం చేసి రూ. 56 వేలు కాజేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరా ల ప్రకారం.. ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన సింధులక్ష్మికి (24) వారం రోజుల క్రితం ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాము నౌక్రీ డాట్ కమ్ నుంచి మాట్లాడుతున్నామని బై జూస్ లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అప్లికేషన్ ఫామ్ కోసం రూ. 3 వేలు, అన ంతరం ఇంటర్వ్యూ చేసి సెలక్ట్ అయినట్లు చెప్పి డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం రూ. 8 వేలు తీసుకున్నారు. ఇలా పలు కారణాలు చెబుతూ మొత్తం రూ.56 వేలు తీసుకుని, ఉద్యోగానికి సంబంధించి ఎలాంటి వివరాలు చెప్పకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం


కల్యాణాన్ని జరిపిస్తున్న పురోహితులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో గురువారం శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర ఆరాధ్య జనసేవా వాహిని ట్రస్ట్ ఆధ్వర్యంలో వీరభద్ర స్వామి వీధి పళ్లెం మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రసిద్ధి చెందిన శ్రీశైల దేవాస్థాన ఉత్సవ విగ్రహాలతో శ్రీశైల భ్రమరాంభ సహిత మల్లికార్జున స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ మహోత్సవంలో ప్రముఖ పౌరాణికులు శ్రీనివాస్ బంగారయ్య శర్మ, ఆధ్యాత్మికవేత్త అనంత లక్ష్మి వివాహ్ పెద్దలుగా వ్యవహరించారు. అనంతరం సింహాచల శాస్త్రీచే దక్షయజ్ఞం హరికథ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి యాగశాల ప్రవేశం, మండపారాధన, రుద్రహోమం, సామూహిక లలిత సహస్ర పారాయణం, సహస్ర లింగార్చన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వర్‌రావు, మడిపల్లి దక్షణామూర్తి, ప్రముఖ వాస్తు నిపుణులు ఎంవీఎం. రావు ట్రస్టు చైర్మన్ తాడికొండ విజయ్‌కుమార్, సుధాకర్, శశిభూషణ్, యమునా పాఠక్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

క్రైస్తవులకు సహకరించాలంటూ వినతి


సంజయ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులకు పోలీసులు సహకరించి, రక్షణ కల్పించాలని ఏఐసీసీ మైనార్టీ విభాగం జాతీయ కో ఆర్డినేటర్ గద్దపాటి విజయరాజు పోలీసులను కోరారు. గురువారం ఆయన అదనపు డీజీ (శాంతిభద్రతలు) సంజయ్‌కుమార్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 24వ తేదీ వరకు ప్రతి రోజు వివిధ రకాల కార్యక్రమాలు జరుగుతాయని, క్రీస్తు జనన సందేశాన్ని తోటి క్రైస్తవులతో పంచుకునేందుకు పాటలను పాడుతూ వారి గృహాలను సందర్శిస్తారని తెలిపారు. రాత్రి 6 గంటల నుంచి మధ్య రాత్రి వరకు ఇవి జరుగుతాయని కాబట్టి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి పెట్టి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేలా ఆదేశాలివ్వాలని వినతి పత్రంలో కోరారు. అలాగే డిసెంబర్ 31వ తేదీ రాత్రి కూడా క్రైస్తవులు ప్రార్థనల్లో గడుపుతారని అందువల్ల ఈ పర్వదినాలను క్రైస్తవులు ప్రశాంతంగా నిర్వహించుకునేలా ప్రత్యేక చొరవతీసుకోవాలని సూచించారు. వినతి ఇచ్చిన వారిలో డేవిడ్ శాంత రాజ్, టీడీఎస్ మణి, డేవిడ్ కదారి ఉన్నారు.

కాలనీల్లో పర్యటిస్తా .. సమస్యలను పరిష్కరిస్తా


ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సనత్‌నగర్: నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో పలువురు కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలు కాలనీలకు చెందిన ప్రతినిధులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకురాగా, త్వరలోనే ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని కనకదుర్గమ్మ ఆలయ చైర్మన్ మల్లికార్జునప్ప, సూపరింటెండెంట్ రంగారెడ్డి, కమిటీ సభ్యులు మాధవరావు, వివేక్‌నాథ్, ఆకుల రాజు, చంద్రశేఖర్, పద్మావతి, సహదేవ్‌గౌడ్, లింగమయ్య, అమీర్‌పేటలోని ప్రశాంత్‌కాలనీ, ఆనంద్‌బాగ్, పార్క్ అవెన్యూ కాలనీలకు చెందిన రాంనివాస్ బన్సాలీ ఆధ్వర్యంలో ప్రవీణ్‌కుమార్‌గుప్తా, సంజయ్ పచారి, రాజేష్ అగర్వాల్, మోండా డివిజన్‌కు చెందిన గణేష్ టెంపుల్ మాజీ చైర్మన్ జయరాజ్ ఆధ్వర్యంలో పద్మ, శరణ్య, లలిత, అనురాధ తలసానిని కలిసి సన్మానించారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

బౌద్ధనగర్: ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ పిలుపునిచ్చారు. పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా సమావేశాన్ని ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ వీఎస్. రాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కోసం మాదిగ జాతి చేస్తున్న ఉద్యమం ప్రస్తుతం చాలా కీలక దశకు చేరిందని 30 ఏళ్లుగా మాదిగ, ఉపకులాల హక్కుల కోసం పోరాడుతూనే సమాజంలో అన్ని వర్గాల పక్షాన నిలబడి పాలకులతో పోరాడుతూ సమాజానికి సంక్షేమ ఫలాలు అందించిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌కు ఉందన్నారు. ఈ సమయంలో జాతి భవిష్యత్తు కోసం మాదగలంతా ఏకమై ఉద్యమం వైపు కదలాలని పిలుపునిచ్చారు. పోరాటంలో వీరులుగా ముందుకు సాగుతున్న మాదిగ బిడ్డలు రాజకీయ శక్తిగా ఎదగడానికి చైతన్యం పెంచుకోవాలన్నారు. విద్యార్థులు, మహిళలు, ఉద్యోగ, మేధావి వర్గాలను ఏకం చేసి జాతి యావత్తును మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరుగుతున్న పోరాటానికి అండగా నిలబడేలా సిద్ధం చేయడానికి శక్తి వంచన లేకుండా శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ నాయకలు కొమ్ము శేఖర్, వీఎస్. రాజు, టీవీ. నరసింహ, డప్పు మల్లికార్జున్, కృష్ణ, సత్యనారాయణ, అరుణ్, మహేష్, రాజశేఖర్, సునీల్, జంగిల్ జగన్, రామకృష్ణ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



స్పీకర్‌కు శుభాకాంక్షలు

శాసనసభ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసెంబ్లీలో గురువారం ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ప్రకటించారు. ఈ సందర్భంగా పోడియం వద్దకు వెళ్లి స్పీకర్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కలిసిన శుభాకాంక్షలు తెలిపారు. –సాక్షి, సిటీబ్యూరో

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: టీ–సేవ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 3600 మంది మహిళలకు 'స్త్రీ శక్తి స్వయం ఉపాధి కంప్యూటర్ శిక్షణ పథకం' ద్వారా శిక్షణ తరగతులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ చేసిన నిరుద్యోగ మహిళలు ఈ నెల 26వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8179955744 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



ప్రమాణస్వీకారం

సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి గెలిచిన పద్మారావు గౌడ్ గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు.
–సాక్షి, సిటీబ్యూరో

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 55, పందిరి బీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 31, దొండ 45, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 70, గోకరకాయ 55, కీర 21, దోసకాయ 25, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఓయూ అభివృద్ధికి చర్యలు చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు నాగేశ్వర్‌రావు, సుమంత్ మాట్లాడారు. ఓయూ అభివృద్ధికి విద్యార్థులు రూపొందించిన ఏజెండాను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్టూడెంట్స్ ఏజెండా అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రుక్మత్ పాషా, సంపత్, మహేష్, కాంత్రి, సంతోష్, సుమన్, నరేష్, మధు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి షురూ



లాలాపేట: క్రైస్తవులు ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరుపుకునే క్రిస్మస్ పండగ సీజన్ ప్రారంభం అయింది. తార్నాక, లాలాపేట, శాంతినగర్ తదితర ప్రాంతాల్లోని చర్చిల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఇళ్లు, చర్చిలను అలంకరించే రంగు రంగుల సామగ్రిని వ్యాపారులు అందుబాటులో ఉంచారు. తార్నాకలోని ఓ దుకాణం వద్ద క్రిస్మస్ స్టార్స్, ట్రీ, శాంటాక్లాజ్ వంటి అలంకరణ వస్తువులను విక్రయానికి సిద్ధంగా ఉంచారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



అడ్డగుట్ట: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 10వ నంబర్ ప్లాట్ ఫాం వద్ద ఈ నెల 10న 55 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నారు. గమనించిన రైల్వే పోలీసులు సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆరు గ్యారంటీల కార్డుల పేరుతో టోకరా

అమీర్‌పేట: ఆరు గ్యారంటీల కార్డుల పేరుతో కార్డులు విక్రయిస్తున్న ఈ సేవా సెంటర్ యజమానితో పాటి మరో జిరాక్స్ సెంటర్ నిర్వహకుడిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డులను విక్రయిస్తున్నట్లు సమాచారంతో సనత్‌నగర్‌కు చెందిన సంతోష్ తన స్నేహితులు ఈరన్న ,సాయికుమార్‌తో కలిసి సనత్‌నగర్‌లోని ఈ సేవా సెంటర్‌కు వెళ్లగా సెంటర్ నిర్వాహకుడు ఒక్కో కార్డుకు రూ.100 చొప్పున తీసుకుని ఆరు కార్డులను విక్రయిస్తున్నట్లు గుర్తించాడు. అతడితో పాటు సెంటర్ ఎదురుగా ఉన్న జిరాక్స్ కేంద్రం నిర్వాహకుడు మహేష్ కూడా కార్డులను విక్రయిస్తున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇరువురిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న వీరభద్రస్వామి కల్యాణం

కాచిగూడ: ప్రపంచ శాంతి, సౌభాగ్యం కోసం, భక్తుల కోరిక మేరకు ఈ నెల 18వ తేదీన కర్మన్‌ఘాట్ ఏపీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే కురవి వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొనాలని వీరభద్ర స్వామి సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్ ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం సాయిబాబా, కాచిగూడలోని పలు ఆలయాలను సందర్శించి ఆహ్వాన పత్రికలను అందజేశారు. దేవాలయానికి వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వీరభద్ర స్వామి కల్యాణ వేడుకలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు జాబ్‌మేళా

సనత్‌నగర్: దిశ, కేంద్ర ప్రభుత్వ డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీస్) సంయుక్తంగా ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలోని దిశ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధి కార్యాలయ యువ అధికారి విజయ్, బీఎస్‌కే డైరెక్టర్ శరత్‌బాబు, దిశ కో–ఆర్డినేటర్లు ఐవాన్‌వాజ్, స్టీవన్ వెల్లడించారు. 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీ, డిప్లొమా విద్యార్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని మరిన్ని వివరాలకు 89771 75394, 94946 98219 నం సంప్రదించాలన్నారు.

ఓయూలో బారికేడ్ల జగడం


విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గతంలో ఏర్పాటు చేసిన ముళ్ల కంచెలు, బారికేడ్లను తొలగించాలని విద్యార్థులు వారం రోజులుగా చేపట్టిన ఆందోళన తీవ్రరూపం దాల్చింది. గురువారం ఐక్య విద్యార్థుల ఆధ్వర్యంలో యూనివర్సిటీ లైబ్రరీ నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీ చేపట్టారు. పరిపాలన భవనం గేట్లు మూసివేయడంతో ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఓయూలో ఏర్పాటు చేసిన పోలీసుల బారికేడ్ల, పరిపాలన భవనానికి అమర్చిన ఇనుప ముళ్ల కంచెను తొలగించి ప్రజాస్వామ్య వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ వీసీ ప్రొ.రవీందర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. పాలన భవనం చుట్టూ ఏర్పాటు చేసిన ముళ్ల కంచెను తొలగించేందుకు యత్నించిన విద్యార్థులను బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థులకు నడుమ పెనుగులాట జరిగింది. విద్యార్థులకు మద్దతుగా లా కాలేజీ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ పాల్గొని అధికారుల తీరు పై మండిపడ్డారు. కార్యక్రమంలో బైరు నాగరాజుగౌడ్, నెల్లి.సత్య, గ్యార నరేష్, ఆజాద్, వలిగొండ నరసింహ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


మహాపడిపూజలో పాల్గొన్న కార్తీకారెడ్డి

లాలాపేట: తార్నాకలో మల్లికంటి వీరన్న మణికంఠ ఆధ్వర్యంలో గురువారం 18వ మహాపడిపూజ ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున పాల్గొన్న అయ్యప్ప భక్తులు అయ్యప్ప గీతాలు, భజనలను ఆలపించారు. మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అయ్యప్పస్వామి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని ఆకాంక్షించారు. నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ప్రభు గుప్తా, కనకట్ల హరి, అంబాల రాజేష్,రాము వర్మ, పోచయ్య యాదవ్, వేణుయాదవ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



కంటోన్మెంట్: కంటోన్మెంట్ అధికారులు అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండటంతో సందట్లో సడేమియాలా రెచ్చిపోయిన అక్రమార్కుల భరతం పడుతున్నారు. రెండు రోజులుగా కంటోన్మెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిరాటంకంగా కూల్చివేతలు కొనసాగుతున్నారు. బొల్లారం డౌటన్ బజార్, సాధన మందిర్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు, మహేంద్రాహిల్స్‌లో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని తొలగించారు. మరిన్ని రోజుల పాటు అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతాయని సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. దళారుల మాటలు నమ్మి నిర్మాణదారులు మోసపోవద్దని సూచించారు. బోర్డు అనుమతి లేకుండా చేపట్టిన ఎలాంటి నిర్మాణాలను ఉపేక్షించబోమన్నారు.